క్లుప్తంగా

విశ్వనాథునికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఉభయకర్తలు

మనుబోలు: మండలంలోని మనుబోలు చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఏకాంబరం శేషయ్య – సుభాషిణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

జొన్నవాడలో..



బుచ్చిరెడ్డిపాళెం: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని జొన్నవాడలోని మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో విశేష పూజలను సోమవారం నిర్వహించారు. గ్రామోత్సవాన్ని జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని ఓ లేఅవుట్లో మహిళలకు రంగవల్లుల పోటీలను సోమవారం నిర్వహించారు. భారత ఇతిహాసాలకు సంబంధించిన ముగ్గులను తీర్చిదిద్దారు. కాగా భోగిని మండలంలో ఘనంగా జరుపుకొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రిజిస్ట్రార్ ఆఫీస్ సెంటర్లో వాహనదారులకు కౌన్సెలింగ్‌ను ఎస్సై సంతోష్‌రెడ్డి సోమవారం నిర్వహించారు. రద్దీ సమయంలో ఆటోలను అడ్డంగా పెట్టి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు వీరిని కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

16న జాబ్ మేళా

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాబ్‌మేళాను ఈ నెల 16న నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భార్గవి ఆటోమొబైల్స్, ఎంజీ బ్రదర్స్, గాయత్రి ఇంటీరియర్స్, గోల్డ్ ఫీల్డ్స్ తదితర కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని, తగిన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10.30కు హాజరుకావాలని కోరారు.



ఐదో బహుమతి ప్రదానం



పాటూరుకు నాలుగో బహుమతి



నీటిని తాగిస్తూ..

కోలాహలంగా..

- ఉత్సాహంగా ఎడ్ల పోటీలు
- భారీగా తరలివచ్చిన జనం
- బహుమతుల ప్రదానం





గెలుపే లక్ష్యంగా..

కోవూరు: కోవూరులోని కొత్తూరు డొండలో సోమవారం జరిగిన ఎడ్ల పోటీలు తిలకించేందుకు వివిధ జిల్లాల నుంచి జనం పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. జనం కేరింతల నడుమ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ప్రవాసాంధ్రులు, పక్క రాష్ట్రాల్లో ఉంటున్న వ్యాపారవేత్తలు, ఉన్నతోద్యోగుల సహకారంతో గెలుపొందిన ఎడ్ల జతలకు బంగారు కప్‌పాటు పారితోషికం అందజేశారు. నాలుగో స్థానంలో పాటూరుకు చెందిన ఎడ్ల జత నిలువగా రూ.15 వేలను వింతా కృష్ణారెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు అందజేశారు. వారికి కప్‌ను సాయం వరదయ్య జ్ఞాపకార్థం కుమారుడు ఆయన కృష్ణ చైతన్య కుటుంబసభ్యులు ఇచ్చారు. ఐదో స్థానంలో నెల్లూరు రంగానాయకులపేటకు చెందిన జత ఎడ్లు నిలువగా బహుమతిగా రూ.10 వేలను గడ్డం చిన్న వెంగళరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు అందజేశారు. కప్‌ను కైలాసం పద్మావతమ్మ జ్ఞాపకార్థం భర్త గోపాలరెడ్డి ఇచ్చారు.



పోటీలకు ఎడ్లను తీసుకొచ్చిన యజమానులు



బరిలోకి దిగే ముందు..



పోటీలను తిలకించేందుకు విచ్చేసిన జనం

నేడు తోడేరుకు కాకాణి రాక

పొదలకూరు: సంక్రాంతి సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు మండలంలోని తన స్వగ్రామమైన తోడేరుకు మంగళవారం రానున్నారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మధ్య కాకాణి పండగ సంబరాల్లో పాల్గొంటారు. సాయంత్రం మూడు గంటలకు నెల్లూరులోని స్వగృహానికి చేరుకుంటారు.

వాలీబాల్ విజేత కలువాయి జట్టు

కలువాయి: మండలంలోని కలువాయిలో మూడురోజులపాటు జరిగిన వాలీబాల్ పోటీల్లో కలువాయి యూత్ జట్టు విజేతగా నిలిచింది. అనంతసాగరం మండలం మంచాలపల్లి జట్టు రెండో స్థానంలో, పొదలకూరు జట్టు మూడో స్థానంలో నిలిచాయి. బహుమతుల కింద రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2,500 అందజేసినట్లు నిర్వాహకుడు బి.నాగరాజు తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం కలువాయి ఎస్సై సుమన్, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిశోర్‌రెడ్డి, చల్లా శివారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆత్మకూరు, అనంతసాగరం, కలువాయి, చేజర్ల, రాపూరు, పొదలకూరు మండలాలకు చెందిన 9 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

ఘన సన్మానం



కొడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పెనాక నాగశ్రీనివాసులురెడ్డిని పెయ్యలపాళెంలోని ఆయన నివాసంలో పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి సోమవారం సత్కరించారు. సర్పంచ్‌లు మారంరెడ్డి రంగారెడ్డి, మోర్ల రమేష్, నేతలు కొండా శ్రీనివాసులురెడ్డి, పెనాక సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

➡ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిని పెమ్మారెడ్డిపాళెం సర్పంచ్ నవీన్ సన్మానించారు.



గోవర్ధన్‌రెడ్డిని కలిసిన నాయకులు



కాకాణితో వైఎస్సార్‌సీపీ నాయకులు

మనుబోలు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆ పార్టీ మండల నాయకులు సోమవారం నెల్లూరులో మర్యాద పూర్వకంగా కలిశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తనను మూడోసారి పార్టీ మండలాధ్యక్షుడిగా నియమించడంతో బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి కాకాణికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పార్థేశ్వరరెడ్డి, మహేష్‌రెడ్డి, ముంగర రవీంద్ర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఏలూరు భాస్కర్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, కోటేశ్వరగౌడ్, పార్థూ, గిరి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలమ్మ గ్రామోత్సవం

మనుబోలు: మండలంలోని మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ గ్రామోత్సవాన్ని ఆదివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అర్చకులు సర్వేపల్లి ఫణీంద్రశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మనుబోలమ్మను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, డీజే ఆకట్టుకున్నాయి. యువకులు రంగులు చల్లుకుంటూ బాణసంచా పేలుస్తూ ఉత్సవం వెంట కేరింతలు కొట్టారు. గూడూరు పెంచలయ్య – జ్యోతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



మనుబోలమ్మ గ్రామోత్సవం

కామాక్షితాయి సేవలో..





బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మవారిని బెంగళూరుకు చెందిన ఐపీఎస్ అధికారి మువ్వా చంద్రశేఖర్, ఆయన సతీమణి ప్రీతి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

➡ జొన్నవాడలోని మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. వీరిని శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



బుచ్చిరెడ్డిపాళెం: కోదండరామస్వామి ఆలయంలో..

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. ధనుర్మాసం సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చివరిరోజున భోగి నాడు కల్యాణోత్సవాన్ని చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు ఎం.శ్యామ్ ప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, సన్నికంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

➡ అయ్యప్ప నగర్‌లో శ్రీదేవి భూదేవి కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి, అల్లూరు రమణయ్య తదితరులు పర్యవేక్షించారు. మంగళవారం సాయంత్రం అప్పయ్య మకరజ్యోతి దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు.

జగనన్నను మరోసారి సీఎం చేయడమే లక్ష్యం



శ్రీనివాసులురెడ్డిని సత్కరిస్తున్న నేతలు

ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టపర్చి.. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గంగపట్నంలో శ్రీనివాసులురెడ్డికి సత్కార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతను మూడోసారి అప్పగించిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. తమ పాలన ఎలా సాగిందో.. ప్రస్తుతం ఎలా ఉందో ప్రజలకు వివరించాలని కోరారు. డీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, బట్టేపాటి నరేంద్రరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, ఎంపీపీ గంధళ్ల శంకరయ్య, నేతలు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, కొండూరు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిల్లిపాది భోగి మంటలు వేసి..



మనుబోలులో..

మనుబోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. ఇందుకోసం ఆదివారం తాటాకులు, కట్టెలు సేకరించి పెట్టుకున్నారు. పండగ నేపథ్యంలో మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. కొన్ని గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించగా మహిళలు పాల్గొన్నారు.

➡ ముత్తుకూరు మండలంలో తెల్లవారుజామున వర్షం కురవడంతో కాస్త ఆలస్యంగా భోగి మంట వేశారు.

➡ పొదలకూరు: భోగి సందర్భంగా మండలంలో జనం మంటలు వేశారు. చిన్నారులు, యువకులు గాలిపటాలు ఎగురవేశారు. క్రికెట్, కబడ్డీ పోటీలు పెట్టుకున్నారు. కాగా వర్షం కురవడం కొంత ఇబ్బంది కలిగించింది. పండగ సోమవారం నాడు రావడంతో చికెన్ సెంటర్ల వద్ద హడావుడి కనిపించ లేదు.

➡ కొడవలూరు: భోగి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం, కొడవలూరు, యల్లాయపాళెం, గండవరంలో యువకులు పోటీపడి మంటలు వేశారు. కాగా ఉదయం భోగి వేద్దామనుకున్న వారు వర్షంతో నిరుత్సాహానికి గురయ్యారు.

➡ ఇందుకూరుపేట: భోగి పర్వదినాన్ని మండల వాసులు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. చిన్నారులపై పండ్లు పోసి ఆశీర్వదించారు.



కొడవలూరు: నార్తురాజుపాళెం కూడలిలో..



పొదలకూరు మండలంలో..



ముత్తుకూరు: భోగి మంటలు వేస్తున్న కుటుంబం